News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :230 | ఖమ్మం | గురువారం, సెప్టెంబర్ 24, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# జల విద్యుత్‌కూ ఎల్‌నినో దెబ్బ



- విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు కష్టాలు...
- తెలంగాణలో విద్యుత్ సంక్షోభం ముప్పు..
- రానున్న రోజుల్లో గడ్డు పరిస్థితులు..?
- తెలంగాణలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం ఆల్ టైం రికార్డ్ స్థాయికి చేరుకుంది
- దీంతో రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం నెలకొంది
- ఎల్‌నినోనే దీనికి కారణంగా తెలుస్తోంది.
- ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి
- దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతుంది.

హైదరాబాద్

రాష్ట్రంలో కరెంట్ కష్టాలు ముంచుకొస్తున్నాయి. ఒకవైపు కరెంటు డిమాండ్ ఆల్‌టైమ్ హైకి చేరుతుంటే.. మరోవైపు కీలక విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తికి బ్రేకులు పడుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం.. జల విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం.. థర్మల్ ప్లాంట్లకు బొగ్గు కొరత.. ఈ పరిణామాలన్నీ కలిసొస్తే తెలంగాణ పవర్ సిస్టమ్‌పై ఎంత ఒత్తిడి పడుతోంది. ఎల్‌నినోతో రానున్న రోజుల్లో తెలంగాణకు కరెంట్ కష్టాలు తప్పేటట్టు లేదు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. వివరాలు 2లో..



# నిశ్శబ్దంగా వ్యాపిస్తోన్న హెచ్1ఎన్1 వైరస్

- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్స్
- తెలంగాణలో ఇన్‌ఫ్లుయెంజా ఏ (హెచ్1ఎన్1) వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి
- ప్రధానంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉండేవారిపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటోంది
- హెచ్1ఎన్1 వైరస్‌పై వైద్యుల అవగాహన

హైదరాబాద్

రాష్ట్రంలో ఇన్‌ఫ్లుయెంజా ఏ (హెచ్1ఎన్1) వైరస్ చాప కింద నీరులా వ్యాపిస్తోంది. హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇలాంటి కేసుల తాకిడి పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీని ద్వారా చాలా మంది ఇబ్బందికి గురికాకపోయినప్పటికీ కొందరిలో తీవ్ర న్యుమోనియాకు దారితీస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్‌లో ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో ఇటీవల ఈ వైరస్ కారణంగా ఒక రోగి మరణించినట్లు సమాచారం. అయితే వివరాలు 2లో..




## 'ఓట్ల చోరీ' ఆరోపణల్లో వాస్తవం లేదు

- ఈసీలో విభేదాలపై విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన బీజేపీ
- ఓట్ల తొలగింపుతో బెంగాల్‌లో తామే ఎక్కువ నష్టపోయామని వెల్లడి
- కమిషనర్ల మధ్య చర్చలు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని వ్యాఖ్య
- ఎన్నికల్లో గెలవలేకే సంస్థలపై కాంగ్రెస్ దాడి చేస్తోందని ఆరోపణ



## 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే మన లక్ష్యం

- టూరిజం సమ్మిట్ లో 'చరైవేతి.. చరైవేతి' శ్లోకాన్ని ఉటంకించిన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్
- పర్యాటక అనుకూల విధానాలను వివరించిన కేంద్ర మంత్రి
- పర్యాటక రంగంతో ఉపాధి అవకాశాలు విశేషంగా పెరుగుతున్నాయని వెల్లడి

## 'సర్'పై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే

- ఎస్ఐఆర్ నిర్ణయాలపై ఇద్దరు ఈసీ సభ్యులు 14 సార్లు అభ్యంతరాలు తెలిపారన్న మీడియా కథనం
- ఈసీ తీరుపై కాంగ్రెస్, సీపీఎం విమర్శలు
- రాజకీయ పార్టీల విమర్శలపై క్లారిటీ ఇచ్చిన ఈసీ




# జూరాల కాల్వలకు సాగునీరు విడుదల




- డీకే శివకుమార్‌కు రేవంత్ రెడ్డి ధన్యవాదాలు
- తెలంగాణకు నీరు విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకారం
- విడతలవారీగా 3 టీఎంసీలను ఇవ్వడానికి హామీ
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్, ఇరిగేషన్ అధికారులతో పాలమూరు ప్రజాప్రతినిధుల భేటీలో నిర్ణయం
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో భేటీలో తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు



## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే!

- ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు
- ఎన్నికల రిగ్గింగ్ గురించి తెలిసి సీఈసీ అనుమతిస్తే దేశద్రోహమని వ్యాఖ్య
- ఈసీలో అవకతవకలపై వస్తున్న కథనాలు అత్యంత తీవ్రమైనవని వ్యాఖ్య
- ఈ ఘటనపై సరైన దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్

# సీఎస్‌తో ఉద్యోగుల ఐకాస చర్చలు విఫలం

- మళ్లీ జేఏసీతో సమీక్షించిన డిప్యూటీ సీఎం
- ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల సాకారం కోసం సీఎస్ సంజయ్ జాజుతో జేఏసీ నేతలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి
- డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదంటూ టీజీఈజేఏసీ అసంతృప్తి వ్యక్తం చేసింది.



హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. నాలుగు ప్రధాన డిమాండ్లలో ఒక్క అంశంపైనా సీఎస్ స్పష్టత ఇవ్వలేదని ఉద్యోగుల జేఏసీ తెలిపింది. దీంతో తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించింది. రేపు జరిగే విస్తృతస్థాయి సమావేశంలో తదుపరి కార్యచరణ ఖరారు చేస్తామని జేఏసీ నేతలు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు చెప్పారు. ప్రభుత్వ సూచన మేరకు రెండు రోజులుగా వాయిదా పడిన ఉద్యోగ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం సచివాలయంలో జరిగింది. ఐదు డీఏల్లో కనీసం మూడు ఇవ్వాలని జేఏసీ నేతలు వివరాలు 2లో..

## ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై బీజేపీ

- తెలంగాణకు సునీల్ భన్సల్
- ఏపీకి అరవింద్ భదౌరియా
- రాష్ట్రాలకు కొత్త ఇన్‌ఛార్జ్‌లను ప్రకటించిన బీజేపీ
- హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లకు ఇన్‌ఛార్జిగా స్మృతి ఇరానీ
- 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు కొత్తగా ఇన్‌ఛార్జిలను, కో-ఇన్‌ఛార్జిలను నియమిస్తూ ఆదేశాలు



## దక్షిణాఫ్రికాలో దారుణం

- దక్షిణాఫ్రికాలో దారుణమైన కాల్పుల ఘటన
- ఇంట్లో పార్టీ చేసుకుంటుండగా జరిపిన దాడిలో 11 మంది మృతి
- మృతుల్లో గర్భిణీ మహిళ కూడా ఉన్నట్టు వెల్లడి
- నిందితుల కోసం 72 గంటల ఆపరేషన్ ప్రారంభించిన పోలీసులు
- మృతుల్లో కొందరికి నేర చరిత్ర ఉన్నట్టు ప్రాథమిక విచారణలో గుర్తింపు



# నిశ్శబ్దంగా వ్యాపిస్తోన్న హెచ్1ఎన్1 వైరస్

-మొదటిపేజీ తరువాయి

వైద్యారోగ్య శాఖ మాత్రం దీన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు.

ఢిల్లీ, కర్ణాటక వంటి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో హెచ్?1ఎన్?1 వైరస్ కేసుల సంఖ్య తక్కువగా ఉంది. అయినప్పటికీ ఈ వైరస్ సులభంగా వ్యాపిస్తుందని, అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇన్?ఫ్లుయెంజా సోకిన వ్యక్తి దగ్గినా లేదా తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. అందుకే తరచుగా చేతులు శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యమని, మాస్క్ ధరించడం ఉత్తమమని డాక్టర్లు చెబుతున్నారు.

### ఎవరికి ఎక్కువ ప్రమాదం?

రోగనిరోధక శక్తి తక్కువగా ఉండేవారిపై వైరస్? ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, ఊపిరితిత్తులు లేదా గుండె సంబంధిత సమస్యల వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉన్నవారు ఫ్లూ బారినపడి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. అయితే ఫ్లూ సోకిన ప్రతి ఒక్కరికీ యాంటీవైరల్ మందులు అవసరం లేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. తీవ్రమైన లక్షణాలు ఉన్నవారు మాత్రమే యాంటీవైరల్ మందులను వాడాలని చెబుతున్నారు. అదీ కూడా వైద్యుల సలహా మేరకే వినియోగించాలని సూచిస్తున్నారు. లక్షణాలు కనిపించిన 48 గంటల్లోపు ఈ మందులను వాడితే మెరుగైన ఫలితాలు ఉంటాయంటున్నారు.

### ఎప్పుడు ఆసుపత్రిలో చేరాలి?

శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా ఆయాసం
ఛాతి నొప్పి, ఒత్తిడి, లేదా నీరసం
రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం
తల తిరగడం, గందరగోళంగా అనిపించడం, వాంతులు చేసుకోవడం
జ్వరం తగ్గుతూ మళ్లీ తిరిగి తీవ్రంగా రావడం



వైరస్ సోకితే కనిపించే ప్రధాన లక్షణాలు
చలితో కూడిన అధిక జ్వరం
దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడం లేదా దిబ్బడ
తీవ్రమైన ఒళ్లు నొప్పులు, తలనొప్పి
నీరసం, అలసట, కొన్ని సందర్భాల్లో వాంతులు, విరేచనాలు

హెచ్1ఎన్1 వైరస్ లక్షణాలు

"(హెచ్1ఎన్1) ఇన్ఫ్లుయెంజా ఏ అనే వైరస్ సంక్రమణ గురించి భయపడాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ పలు జాగ్రత్తలు అవసరం. ఈ వైరస్ సోకిన వారిలో సుమారు 95 శాతం మందిలో తేలికపాటి లక్షణాలు మాత్రమే కనిపిస్తాయి. వీరు ఇంట్లో విశ్రాంతి తీసుకోవడంతో కోలుకోవచ్చు. వైద్యులు సూచించినంత కాలం యాంటీవైరల్ మందులను కచ్చితంగా తీసుకోవాలి. అన్నింటికంటే ముఖ్యంగా సీజనల్ ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితం. ఇంట్లోనే ఉంటూ కాచి వడకట్టిన నీరు, పండ్ల రసాలు, వేడి సూప్‌లు, ఓఆర్ఎస్‌లను తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండొచ్చు. లక్షణాలు తీవ్రంగా ఉంటే ఆసుపత్రిలో చేరాలి"

# జల విద్యుత్‌కూ ఎల్‌నినో దెబ్బ..

-మొదటిపేజీ తరువాయి

అదే స్థాయిలో తెలంగాణలో కరెంట్ డిమాండ్ దూసుకెళ్తోంది.. రికార్డు స్థాయిలో విద్యుత్ అవసరం పెరుగుతోంది. కానీ అదే సమయంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఒకవైపు బొగ్గు కొరతతో థర్మల్ ప్లాంట్లు ఉక్కిరిబిక్కిరి.. మరోవైపు వర్షాభావంతో జల విద్యుత్‌కు గండంగా మారింది. ఇప్పటికే రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 19,543 మెగావాట్ల ఆల్‌టైమ్ హైని తాకింది. గత ఏడాది ఇదే సమయంలో నమోదైన 15,906 మెగావాట్లతో పోలిస్తే ఇది దాదాపు 23 శాతం అధికంగా ఉంది. సాధారణంగా సెప్టెంబర్ లో డిమాండ్ కొంత తగ్గాల్సి ఉన్నా.. వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఉక్కపోత కారణంగా ఏసీల వినియోగం కొనసాగడం కూడా వినియోగాన్ని పెంచుతోంది. ఇక్కడే అసలు టెన్షన్ మొదలైంది. డిమాండ్ పెరుగుతున్న సమయంలోనే రాష్ట్రంలోని కొన్ని కీలక విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోవడం పవర్ సిస్టమ్‌పై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్‌కు తగ్గట్టుగా సప్లై చేయాల్సిన పవర్ ప్లాంట్లు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. మొత్తం మూడు థర్మల్, రెండు హైడల్ ప్రాజెక్టుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు కొరత పెద్ద శాపంగా మారింది. బొగ్గు రాక.. ప్లాంట్లు నడవక.. యాదాద్రిలో ఏకంగా రెండు యూనిట్లను మూసివేయాల్సి వచ్చింది. నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన యాదాద్రి పవర్ ప్లాంట్ లో ఏకంగా 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగింది. ప్రధానంగా నాణ్యమైన బొగ్గు సరఫరా కాకపోవడమే ఉత్పత్తికి ప్రధాన కారణంగా అధికారులు చెబుతున్నారు. ఇటు చూస్తే కేటీపీఎస్, అటు చూస్తే బీటీపీఎస్ ప్లాంట్లు కూడా బొగ్గు దొరక్క తంటాలు పడుతున్నాయి. ఇక భద్రాద్రి ప్లాంట్ కథ మరీ దారుణం! ఇక్కడ బొగ్గు సమస్యకు తోడు.. నిర్వహణ లోపాలు, సాంకేతిక సమస్యలు తోడయ్యాయి. ఫలితంగా 1080 మెగావాట్ల సామర్థ్యం కలిగిన భద్రాద్రి పవర్ ప్లాంట్ లో రెండు కీలక యూనిట్లు మూత పడ్డాయి. దీంతో మరో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి గండి పడింది. 2600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రామగుండంలో ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు తవ్వకాలు తగ్గిపోవడంతో అక్కడ కూడా ఉత్పత్తి పడిపోయింది. వారంలోనే రాష్ట్రంలోని మూడు థర్మల్, రెండు హైడల్ యూనిట్లలో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మూడు థర్మల్ యూనిట్లకే కలిపి సుమారు 1,870 మెగావాట్ల ఉత్పత్తి ప్రభావితమైంది.

### జల విద్యుత్‌కూ ఎల్‌నినో దెబ్బ..

థర్మల్ ప్లాంట్ల పరిస్థితి ఇలా ఉంటే.. జల విద్యుత్ (హైడల్) ప్రాజెక్టులను ఎల్ నినో ఎఫెక్ట్ నిలువునా ముంచేసింది. వర్షాలు లేక రిజర్వాయర్లలో నీటి ఎద్దడి తీవ్రమైంది. శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల ప్రాజెక్టుల్లో నీరు లేక విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోతోంది. ఎప్పుడూ పీక్ డిమాండ్ టైంలో ఆదుకునే హైడల్ పవర్.. ఈసారి చేతులెత్తేయడంతో సంక్షోభం మరింత ముదిరింది. 810 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాగార్జునసాగర్ లో ప్రస్తుతం పీక్ డిమాండ్ టైంలో 2.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. 900 మెగావాట్ల సామర్థ్యం కలిగిన శ్రీశైలంలో ప్రస్తుతం పీక్ డిమాండ్ టైంలో 8.10 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. జూరాల ప్రాజెక్టులో ఆశించడం స్థాయిలో నీరు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిపివేశారు.

### పవర్ క్రైసిస్ పై పొలిటికల్ వార్..


పవర్ ప్లాంట్లకు బొగ్గు కొరతపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పవర్ వార్ సాగుతోంది. విద్యుత్ కష్టాలన్నీ గత ప్రభుత్వానివేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని స్పష్టం చేస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని అప్పుల పాలు చేసిందని, నాసిరకం ప్లాంట్ల నిర్మాణం మరియు నిర్వహణ లోపాల వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని కాంగ్రెస్ నేతలు మండి పడుతున్నారు. యాదాద్రి ప్లాంట్ ఆలస్యానికి, సింగరేణిపై ఉన్న బకాయిలకు గత ప్రభుత్వ విధానాలే కారణమని కొట్టిపారేస్తున్నారు. బొగ్గు కొరత, ఎల్ నినో పరిస్థితులు అంటూ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని తగ్గిస్తోందని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. తమ హయంలోనే 21వేల మెగావాట్ల విద్యుదుత్పత్తికి రంగం సిద్ధం చేశామని అంటున్నారు.

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వ దృష్టి..

ఈ పవర్ షాక్ నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలపై ముమ్మరంగా దృష్టి సారించింది. ఒడిశాలోని 'నైనీ' బొగ్గు గనుల నుంచి యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు సరఫరాను అత్యంత వేగంగా పెంచాలని సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్లో అవసరమైతే పవర్ ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసి డిమాండ్‌ను అందుకోవాలని డిస్కాంలు ప్లాన్ చేస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం ఇలాగే కొనసాగితే, విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడం తెలంగాణ ప్రభుత్వానికి కత్తిమీద సామే కానుంది.

# ఎయిర్ పోర్టు క్రెడిట్ కోసం రేవంత్

**వరంగల్ :** తెలంగాణ సంస్కృతికి, పోరాటాల చరిత్రకు వరంగల్ జిల్లా గుండెకాయ లాంటిది. ఓరుగల్లు మట్టికి ఉన్న రాజకీయ, భావోద్వేగ ప్రాముఖ్యత హైదరాబాద్‌ను మించి ఉంటుంది. అలాంటి చారిత్రాత్మక వరంగల్‌లోని దశాబ్దాల కల అయిన మామునూరు ఎయిర్‌పోర్ట్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం ప్రత్యేకమైనది. ఎయిర్‌పోర్ట్ రన్ వేలు, టెర్మినల్ భవనాల నిర్మాణం ఇంకా తొలి దశలోనే ఉన్నప్పటికీ.. ఈ కొత్త ఎయిర్‌పోర్ట్‌కు ఏ పేరు పెడితే బాగుంటుంది? మీ సూచనలు తెలపండి అంటూ సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా వేసిన ఒకే ఒక్క ప్రశ్న ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎమోషనల్ అండ్ పొలిటికల్ డిబేట్‌గా మారింది. కార్యరూపంలో ఒక పనిని పూర్తి చేయడం ఒకెత్తయితే, దాని నుంచి గరిష్ట రాజకీయ ప్రయోజనాన్ని, క్రెడిట్ ను తమ ఖాతాలో వేసుకోవడం మరొక ఎత్తు. ఈ విషయంలో రేవంత్ రెడ్డి అందరికంటే రెండు అడుగులు ముందే ఉన్నారని చెప్పవచ్చు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మామునూరు ఎయిర్‌పోర్టుకు భూసేకరణ జరగలేదని, బీఆర్ఎస్ నేతలు కేవలం ఫామ్‌హౌస్‌లకే ప్రాధాన్యమిచ్చారని విమర్శిస్తూనే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.295 కోట్ల నిధులు కేటాయించి, 280 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి ఏఏఐ కి అప్పగించిన విషయాన్ని రేవంత్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. టెండర్ల ప్రక్రియ రూ.213 కోట్లతో ప్రారంభమైన వెంటనే 'పేరు సూచించండి' అని పిలుపునివ్వడం ద్వారా ప్రాజెక్ట్ సాధన క్రెడిట్ మొత్తాన్ని తన ఖాతాలోకి లాక్కోగలిగారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం తర్వాత తెలంగాణలో ప్రస్తుతం మరే ఇతర రవాణా ఎయిర్‌పోర్ట్ లేకపోవడం వల్ల.. ఉత్తర తెలంగాణకు వరంగల్ ఎయిర్‌పోర్టే ఏకైక లైఫ్‌లైన్‌గా మారబోతోంది. ఇది కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదు; కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఐటీ రంగాలు, రామప్ప దేవాలయం, వెయ్యి స్తంభాల గుడి వంటి పర్యాటక ప్రాంతాలకు ఒక న్యూ గ్లోబల్ గేట్‌వే అని చాటిచెప్పడం ద్వారా రేవంత్ ఓరుగల్లు ప్రజల ఆకాంక్షను తట్టారు. ఈ 'నేమ్ గేమ్' పిలుపునకు సోషల్ మీడియా నుంచి, సినీ రంగానికి చెందిన ప్రముఖుల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. వరంగల్‌కు చెందిన ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పందిస్తూ రుద్రమ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా కాకతీయ అంతర్జాతీయ విమానాశ్రయం అనే పేర్లను సూచించగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సమ్మక్క-సారలమ్మ , నటుడు విజయ్ దేవరకొండ, బండ్ల గణేష్, ఇతర నేతలు కాకతీయ , పి.వి. నరసింహారావు , 'చాకలి ఐలమ్మ వంటి చారిత్రాత్మక పేర్లను లేవనెత్తారు. సందీప్ వంగాకు రేవంత్ ఇచ్చిన దట్స్ ది స్పిరిట్ రిప్లై కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యింది. దీని ద్వారా రేవంత్ సాధించిన రాజకీయ ప్రయోజనం ఏంటంటే.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రావడానికి కనీసం మరో రెండేళ్లు సమయం పడుతుంది. కానీ, ఈ పేరు చుట్టూ నడిచే చర్చ వల్ల వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి కీలక జిల్లాల ప్రజల మనస్సులో మామునూరు ఎయిర్‌పోర్టును మళ్లీ ట్రాక్‌పైకి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే.. రేవంత్ రెడ్డి చొరవతోనే ఇది సాధ్యమైంది అనే బలమైన ముద్ర పడింది. నిర్మాణం పూర్తికాకముందే ఎమోషనల్ కనెక్ట్‌ను క్రియేట్ చేయడంలో సీఎం సక్సెస్ అయ్యారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ దీనిపై ఎంతగా ఎదురుదాడి చేయాలని చూసినా, భూసేకరణ పూర్తికావడం, ఆంక్షల క్లియరెన్స్ సాధించడం, టెండర్లు పడటం వంటి సాంకేతిక ఆధారాలు కాంగ్రెస్ వైపే ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ పేరుపై చర్చ పెట్టడం ద్వారా తెలంగాణ మూలాలను, ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తున్నారనే భావన కల్పిస్తూనే.. రాబోయే రోజుల్లో వరంగల్‌లో కాంగ్రెస్ తన రాజకీయ పట్టును మరింత పటిష్టం చేసుకునే దిశగా సీఎం రేవంత్ రెడ్డి తెలివైన పావును కదిపారని భావిస్తున్నారు.




## సీఎస్‌తో ఉద్యోగుల ఐకాస చర్చలు విఫలం

-మొదటిపేజీ తరువాయి

డిమాండ్ చేయగా రెండు డీఏలు ఇవ్వాలని కేబినెట్‌కు సిఫార్సు చేస్తామని సీఎస్ సంజయ్ జాజు చెప్పినట్లు తెలిపారు. దసరా నాటికి ఒకటి, ఉగాది వరకు మరో డీఏ ఇచ్చేలా ప్రతిపాదిస్తామని సీఎస్ చెప్పారన్న ఉద్యోగ సంఘం నేతలు నాలుగు ప్రధాన డిమాండ్లలో ఒక్కదానిపైనా సీఎస్ స్పష్టత ఇవ్వలేదని చెప్పారు.

### ఉద్యమం కొనసాగుతుంది

పెండింగు బిల్లుల కోసం నెలకు రూ.2వేల కోట్లు ఇవ్వాలని తాము కోరగా ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.వెయ్యి కోట్లు మాత్రమే చెల్లించగలమని సీఎస్ చెప్పారని ఉద్యోగుల జేఏసీ పేర్కొంది. పీఆర్సీ నివేదిక ఒకట్రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉందని, ఆ తర్వాత రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సీఎస్ దాటవేసే ప్రయత్నం చేశారని జేఏసీ అసంతృప్తి వ్యక్తంచేసింది. సీపీఎస్‌పై కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పినా ఎప్పట్లోగా వేస్తారు, నివేదిక సమర్పణకు ఎంత కాలం గడువు ఇస్తారో స్పష్టం చేయలేదని ఉద్యోగ సంఘాలు తెలిపాయి. చర్చలు విఫలమైనందున డిమాండ్ల సాధన కోసం ఉద్యమం కొనసాగుతుందని ఉద్యోగుల జేఏసీ నేతలు ప్రకటించారు. "ఈరోజు రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన చర్చలు సంతృప్తికరంగా లేవు. ముఖ్యంగా మూడు డీఏలు, నెల రోజుల్లో పీఆర్సీ ప్రక్రియను ప్రారంభిస్తారని మేము భావించాం. అదేవిధంగా పెండింగ్ బాకయిలు, కొత్త పెన్షన్ విధానం పట్ల ప్రభుత్వం క్రియాశీలకంగా ముందడుగు వేస్తుందని ఆశించాం. కానీ కేవలం ఇంక్రిమెంట్‌పైన మాత్రమే సానుకూలంగా స్పందించారు" - మధుసూదన్ రెడ్డి, ఉద్యోగుల జేఏసీ కో కన్వీనర్ గురువారం టీజీఈజేఏసీ రాష్ట్రస్థాయి అత్యవసర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి తదుపరి కార్యచరణ ఖరారు చేస్తామని ఉద్యోగ జేఏసీ నేతలు తెలిపారు.

## జూరాల కాల్వలకు సాగునీరు విడుదల

ఎల్‌నినోతో ఏర్పడిన నీటిఎద్దడితో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన బాటపట్టిన జూరాల ఆయకట్టు రైతులకు కర్ణాటక ప్రభుత్వం నుంచి శుభవార్త అందింది. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల చర్చలతో నీటివిడుదలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. నారాయణపూర్ నుంచి జూరాలకు విడతల వారీగా 3 టీఎంసీల విడుదల చేయాలని సీఎం డీకే శివకుమార్ అధికారులను ఆదేశించారు. కర్ణాటక సర్కార్ సానుకూల స్పందనతో జూరాల కాల్వలకు అధికారులు సాగునీటిని విడుదల చేశారు.

### 3 టీఎంసీల విడుదలకు వెంటనే చర్యలు

జూరాల ఆయకట్టు రైతులు, ఆందోళనలు, రాస్తారోకోలతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితానిచ్చాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కీలకమైన జూరాల జలాశయం కింద కృష్ణా జలాలను విడుదల చేయాలని రాష్ట్ర మంత్రుల బృందం విజ్ఞప్తికి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో మరోసారి భేటీ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నీటి ఎద్దడిపై వివరించి నారాయణపూర్ నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. మంత్రుల విజ్ఞప్తికి శివకుమార్ అంగీకరించారు. నారాయణపూర్ నుంచి జూరాలకు విడతల వారీగా 3 టీఎంసీల విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### డీకే శివకుమార్‌కు రేవంత్ రెడ్డి ధన్యవాదాలు

మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి కర్ణాటక సీఎంకు ఫోన్ చేసి జూరాల దిగువన ఉన్న అవసరాలను వివరించారు. నీటి నిల్వలు తగ్గిపోయిన నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఎగువన ఉన్న ఆలమట్టి, నారాయణపూర్‌ల నుంచి నీటి విడుదలకు ఉన్న అవకాశాలపై చర్చించారు. రాష్ట్రం నుంచి మంత్రుల బృందాన్ని పంపుతున్నట్లు డీకేకు వివరించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా డీకేతో మాట్లాడారు. ఈ పరిణామాల నడుమ మంగళవారం బెంగళూరు వెళ్లిన మంత్రుల బృందం నీటివిడుదలపై కర్ణాటక సీఎంకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మరోసారి భేటీ అవుదామని డీకే సూచనతో మళ్లీ జరిగిన సమావేశంలో సానుకూల నిర్ణయం వెలువడింది. పాలమూరు రైతుల కోసం నీటి విడుదలకు అంగీకరించిన డీకే శివకుమార్‌కు తెలంగాణ ప్రజల తరఫున రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య స్నేహభావానికి ఇది చక్కటి నిదర్శనమని పేర్కొన్నారు.

"తెలంగాణకు కృష్ణా నదీ జలాలను విడుదల చేయాలన్న విజ్ఞప్తిని అంగీకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్?కు తెలంగాణ ప్రజల తరఫున నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఇది రెండు రాష్ట్రాల మధ్య ఉన్న స్నేహానికి గొప్ప ఉదాహరణ. భారతదేశ ప్రజల ప్రేమ, సోదరభావాన్ని చాటిచెబుతుంది"

### సాగునీరు విడుదల

కర్ణాటక సానుకూల నిర్ణయంతో జూరాల జలాశయం కాలువలకు అధికారులు తిరిగి సాగునీటిని విడుదల చేశారు. ఈ నెల 14న జూరాల ఆయకట్టు కింద ఉన్న కుడి, ఎడమ కాలువలకు అధికారులు సాగునీటిని నిలిపేశారు. దీంతో సాగునీటిని వెంటనే విడుదల చేయాలంటూ రైతులు.. గత వారం నుంచి ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. అన్నదాతలకు మద్దతుగా ప్రతిపక్ష బీఆర్ఎస్?, బీజేపీ కూడా ఆందోళనలు చేపట్టాయి. ఈ పరిణామాల మధ్య కర్ణాటక సర్కార్‌తో చర్చలు ఫలించి నీటి విడుదలకు మార్గం సుగమమైంది. ఇదే సమయంలో జూరాలకు స్వల్పంగా వరద పెరిగిందని అధికారులు తెలిపారు. సాగునీటి విడుదలను పునరుద్ధరించినందుకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## దానం గెలిస్తే...

## అమత్యా గ్యారంటీ

**హైదరాబాద్ :** ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ ఇచ్చిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో నూతన సమీకరణాలకు తెరలేపింది. బి-ఫామ్‌పై ప్రత్యక్షంగా మరో పార్టీ తరఫున పోటీ చేయడమే ఆధారంగా హైకోర్టు డివిజన్ బెంచ్ చారిత్రాత్మక తీర్పు ఇవ్వడంతో, దానం పొలిటికల్ కెరీర్ ఒక కీలకమైన మలుపు వద్దకు వచ్చింది. తొలుత ఉపఎన్నికకు సిద్ధమని ప్రకటించినప్పటికీ, న్యాయ నిపుణుల సలహాతో దానం నాగేందర్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, స్పష్టమైన దస్తావేజు ఆధారాలు ఉన్న ఈ కేసులో సుప్రీంకోర్టు నుండి తక్షణ స్టే దక్కడం సులువు కాదనేది చట్ట నిపుణుల అంచనా. న్యాయస్థానాల్లో సుదీర్ఘంగా సాగే ప్రక్రియ ద్వారా విచారణను ఆలస్యం చేయడం కంటే, దానం నాగేందర్ నేరుగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ఉపఎన్నికను ఎదుర్కొనడమే ఆయన రాజకీయ భవిష్యత్తుకు అత్యంత ప్రయోజనకరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ కేబినెట్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధికి చెందిన బలమైన బిసి నాయకుడి ప్రాతినిధ్యం లేకపోవడం ఒక రాజకీయ లోటుగా ఉంది. దానం నాగేందర్ వంటి సీనియర్, బహుళ ప్రజాదరణ ఉన్న హైదరాబాద్ బిసి నేత మంత్రివర్గంలో ఉంటే గ్రేటర్ పరిధిలో పార్టీకి మరింత మైలేజ్ వస్తుందని కాంగ్రెస్ అధిష్టానం కూడా భావిస్తోంది. ఒకవేళ దానం నాగేందర్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధిస్తే, ఆయన రాజకీయ ఇమేజ్ ఒక్కసారిగా మారిపోతుంది. పార్టీ ఫిరాయింపుల ముద్రను, చట్టపరమైన అనర్హత వేటును నియోజకవర్గ ప్రజల తీర్పు ద్వారా చెరిపేసుకున్నట్లు అవుతుంది. అసెంబ్లీలోకి అడుగుపెడితే, ఆయన రాజకీయ నైతికతకు తిరుగులేని బలం చేకూరుతుంది. అప్పుడు ఆయనకు గ్రేటర్ హైదరాబాద్ కోటాలో కేబినెట్ బెర్త్ కేటాయించడం సీఎం రేవంత్ రెడ్డికి కూడా సులభం, అనివార్యం కానుంది. ఖైరతాబాద్ నియోజకవర్గ క్షేత్రస్థాయి సమీకరణాలు కూడా దానంకు పూర్తి అనుకూలంగా ఉన్నాయి. దశాబ్దాలుగా ప్రతి బస్తీలో ఆయనకు ఉన్న సొంత అనుచరగణం, వ్యక్తిగత పట్టు కాదనలేని సత్యం. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ వద్ద దానం స్థాయిని తట్టుకుని నిలబడే లోకల్ ఫేస్ గానీ, బలమైన సంస్థాగత కేడర్ గానీ అందుబాటులో లేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ బలం, అభివృద్ధి సంక్షేమ పథకాలు తోడైతే ఉపఎన్నికలో గెలుపు నల్లేరుపై నడకేనని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. సుప్రీంకోర్టులో కేవలం విచారణల చుట్టూ కాలయాపన చేస్తూ ఉంటే.. నియోజకవర్గంలో అనుమానాలు, ప్రత్యర్థుల ప్రచారాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. దానికంటే కోర్టుల కంటే ప్రజా కోర్టు పెద్ది అనే నినాదంతో ఉపఎన్నికల బరిలోకి దిగి, స్పష్టమైన మెజారిటీ సాధించడమే దానం నాగేందర్ స్థానాన్ని, రాజకీయ ఆధిపత్యాన్ని పునరుద్ధరిస్తుంది. కోర్టుల్లో స్టేల కోసం పోరాడటం కంటే ప్రజాక్షేత్రంలో తాడోపేడో తేల్చుకో?మే దానం నాగేందర్‌ను ఖైరతాబాద్‌కే కాదు, ఏకంగా సెక్రటేరియట్‌లోని మంత్రి పీఠం వైపు నడిపించే వ్యూహాత్మక మార్గమని ఎక్కువ మంది సలహాలిస్తున్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం: కళ్లద్దాల పంపిణీ

- గ్రామపంచాయతీ వద్ద
- సర్పంచ్ స్రవంతి సతీష్ ఆధ్వర్యంలో



**సెప్టెంబర్ 23 (సీ కే న్యూస్) చెగుంట :**చేగుంట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ ఆధ్వర్యంలో,కంటి వైద్య శిబిరం మేడ్చల్‌కు చెందిన ఆక్సివిజన్ లేజర్ కంటి ఆసుపత్రి' సహకారంతో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ప్రముఖ నేత్ర వైద్య బృందం సభ్యులు డాక్టర్ కృష్ణవేణి, అశ్విన్, వైశాలి, శోభ తదితరులు అత్యాధునిక సాంకేతిక పరికరాలతో గ్రామస్తులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపాలు ఉన్నవారికి అవసరమైన వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా ఐ-డ్రాప్స్ పంపిణీ చేశారు. అలాగే సర్పంచ్ సహకారంతో కంటి అద్దాలను 50 శాతం రాయితీపై అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ రఫీ, వార్డు సభ్యులు ఆకుల సుఖేందర్, హరీఫ్‌లు మాట్లాడుతూ.. మానవ శరీరంలో కంటిచూపు అత్యంత కీలకమైనదని, పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా గుర్తించేందుకే సర్పంచ్ చొరవతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజల వద్దకే నాణ్యమైన వైద్యాన్ని అందించిన వైద్యులు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ అశ్విన్, డాక్టర్ వైశాలి, డాక్టర్ శోభలకు, ఆసుపత్రి మార్కెటింగ్ డైరెక్టర్ అజర్‌కు గ్రామ పాలకవర్గం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహంకాళి ఆలయ చైర్మన్ సంద్రుగు సతీష్, వార్డు సభ్యుడు రవి, పంచాయతీ సిబ్బంది తలారి లింగం, షాదుల్లా, శ్రీనివాస్, వివిధ గ్రామాల ప్రజలు చేగుంట పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం.. బృందావన్ కాలనీలో ఘనంగా అన్నదానం

ఉత్కంఠగా లడ్డూ వేలం.. తొలి లడ్డూ రూ.51 వేల సొంతం





**సి కే న్యూస్ షాద్ నగర్ :సెప్టెంబర్ 23:**షాద్ నగర్ పట్టణంలోని బృందావన్ కాలనీలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినాయకుని సన్నిధిలో ప్రత్యేక పూజలు, అన్నదానం, లడ్డూ వేలం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. చిన్నారులు, యువకులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలం ఉత్కంఠభరితంగా సాగింది. మొదటి లడ్డూను కంది యాదయ్య గౌడ్ రూ.51,000లకు, రెండవ లడ్డూను డాక్టర్ గోపాల్ నాయక్ రూ.16,000లకు కైవసం చేసుకున్నారు. అలాగే కలశాన్ని మమత--రమేష్ దంపతులు రూ.11,000లకు, శాలువాను తిరుపతి నాయక్ రూ.16,100లకు వేలంలో దక్కించుకున్నారు. వేలంలో లడ్డూలు, కలశం, శాలువాలను కైవసం చేసుకున్న వారిని బృందావన్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిట్టల యాదయ్య, కమిటీ సభ్యులు, కాలనీవాసులు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి కౌన్సిలర్ రాజు నాయక్ హాజరై మాట్లాడుతూ.. కాలనీవాసులంతా ఐకమత్యంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్నదానం అత్యంత గొప్ప సేవా కార్యక్రమమని, ఆకలితో ఉన్న వారికి అన్నం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటుకోవచ్చని అన్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా భక్తి, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాలనీవాసులు, భక్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంది యాదయ్య గౌడ్, సీనియర్ జర్నలిస్టు మల్లికార్జున్ నాయక్, రాజు, రమేష్, కృష్ణయ్య, శ్రీనివాస్ రెడ్డి, అతిష్, బలరాం నాయక్, కవిశ్వర్, సంతోష్ గౌడ్, లింగం గౌడ్, నవీన్, అసలేష్, డాక్టర్ గోపాల్ నాయక్, రమాకాంత్ రెడ్డి, శ్రీశైలం, తిరుపతి నాయక్, సంతోష్, అభి, శివ తదితరులు పాల్గొన్నారు.

# పేద పిల్లల కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరో ముందడుగు

**దాతల సహకారంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన**

**సి కే న్యూస్ షాద్ నగర్ :సెప్టెంబర్ 23:**షాద్‌నగర్ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మరో ముందడుగు వేశారు. ఇప్పటికే దాతల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయన, తాజాగా సంచార జాతులకు చెందిన పేద పిల్లల కోసం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సిండికేట్ కాలనీలో సంచార జాతుల పిల్లల కోసం నిర్మించనున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. దాతల సహకారంతో పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే తన లక్ష్యమన్నారు. పేద పిల్లలు తమకు పాఠశాల కావాలని కోరినప్పుడు తనను ఎంతో చలించివేసిందని, వారికి చదువుకునే అవకాశం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వారి విజ్ఞప్తిపై వెంటనే స్పందించి పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పేద విద్యార్థుల విద్య విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, విద్యారంగంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పేద పిల్లల విద్యకు దాతలు ముందుకు వచ్చి అండగా నిలవడం అభినందనీయమన్నారు. అదేవిధంగా పేద విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్‌లు తదితర సహాయాన్ని అందించేందుకు మీడియా ప్రతినిధులు కూడా తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, గ్రామ సర్పంచ్ కుమార్, మండల విద్యాధికారి మనోహర్, కౌన్సిలర్ సి. పెంటయ్య, కొప్పునూరి ప్రవీణ్ కుమార్, దిలీప్, చందులాల్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు రఘు నాయక్, కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీం, బాలరాజు గౌడ్, రాయికల్ శ్రీనివాస్, కృష్ణారెడ్డి, చందు నాయక్, సిద్ధార్థ, కరుణాకర్, నక్క బాలరాజు, గడ్డం జంగయ్య, రాము, గొర్ల నెక్స్ట్ మాధవులు యాదవ్, మనీష్, నీరటి వాసు, మంగ అశోక్, గంగమోని సత్తయ్య, సీతారాములు, మహేందర్, విష్ణు, సుదర్శన్, రాము, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కాలనీకి చెందిన ఆమ్‌గోత్ రాజు నాయక్, బుచ్చి అన్న, బొట్టు రమేష్, ముత్యాలు, రవి, మల్లేష్, యాదయ్య, స్వామి, రాము, ఎల్లయ్యతో పాటు మహిళలు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.













## భద్రాచలం ఇసుక రీచ్ సమీపంలో 3.5 కేజీల ఎండు గంజాయి పట్టివేత.



**ఇద్దరు వ్యక్తుల అరెస్ట్.. ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం.**

**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23,**భద్రాచలంలోని ఇసుక రీచ్ సమీపంలో ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 3.5 కేజీల ఎండు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం వస్తువుల విలువ సుమారు రూ.2.80 లక్షలుగా అధికారులు తెలిపారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆర్. కిషన్ ఆదేశాల మేరకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎన్. నరేందర్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ సీహెచ్. శ్రీహరి రావు, సిబ్బంది బుధవారం భద్రాచలం ఇసుక రీచ్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు.

ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న యమహా ఎం టి ద్విచక్ర వాహనం (రిజిస్ట్రేషన్ నంబర్: టి జి 05 ఎఫ్ 3115 )ను ఆపి తనిఖీ చేయగా 3.5 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన మస్కె మున్నా (తండ్రి మల్లయ్య), జున్జు శ్రీనివాస్ (తండ్రి నరసింహ)లు మారేడుమిల్లి నుంచి ఘట్‌కేసర్‌కు గంజాయిని తరలిస్తున్న సమయంలో పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన ఇద్దరు నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో ట్రైనింగ్ ఎస్ఐలు సందీప్, పృథ్వీ, కానిస్టేబుళ్లు వీరబాబు, ప్రసన్న కుమార్, డ్రైవర్ సాయి పాల్గొన్నారు.

## రిమ్స్ చీxజ్ఞు ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు



**సికె.న్యూస్. ప్రతినిధి అదిలాబాద్:** ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు

నిన్న ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని చీ×జ్ఞులో చోటుచేసుకున్న విషాద ఘటన నేపథ్యంలో అస్వస్థతకు గురై ప్రైవేట్ ఆసుపత్రుల లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డా నరేష్ జాదవ్ గారు పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందుతున్న వైద్య సేవలు, చికిత్సా విధానంపై వైద్యులతో వివరాలు తెలుసుకున్నారు. బాధిత చిన్నారుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం రిమ్స్ ఆస్పత్రిలో ప్రమాదం జరిగిన చీ×జ్ఞు లో సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై వైద్య అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యులను కోరారు . బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా మరిన్ని రిమ్స్ కు అదనపు నిధులు కేటాయించేలా ప్రయత్నం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి గారు, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి గారు, జిల్లా కాంగ్రెస్ ఆఫీసు ఇంచార్జ్ గౌలి సంజీవ్ కుమార్ గారు, మాజీ టిటిడి బోర్డ్ మెంబర్ అనిల్ కుమార్ గారు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజార్ పాషా గారు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు రూపేష్ రెడ్డి గారు, జిల్లా కాంగ్రెస్ ఎస్సి విభాగం అధ్యక్షులు పరమేశ్వర్ గారు,జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ దేవిదాస్ చారి గారు, శ్రీమతి మందాకిని గారు, ఆదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ వార్డు ప్రెసిడెంట్లు తుమ్మ విశాల్ గారు, బండి సంజయ్ గారూ, జహీర్ గారు,జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు రూ. 1 లక్ష చొప్పున నష్ట పరిహారం ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ



**సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్:**ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు అందించాలి

మీడియాతో బీఆర్ఎస్ బృందంఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్నిప్రమాద స్థలాన్ని బుధవారం బీఆర్ఎస్ పార్టీ మహిళ బృందం సభ్యులు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, తుల ఉమ మరియు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి జాన్సన్ నాయక్ లు సందర్శించి, అనంతరం ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరిశీలించారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం రూ. 1 లక్ష చొప్పున బీఆర్ఎస్ పార్టీ తరపున నష్ట పరిహారం ప్రకటించారు. ప్రభుత్వం రూ. 25 లక్షల చొప్పున నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

## వినాయక స్వామి ప్రత్యేక పూజలు

- పూజ కార్యక్రమంలో పాల్గొన్న జి. విజయ్ కుమార్ కుటుంబ సభ్యులు



**సి కే న్యూస్ షాద్ నగర్ 23:**శ్రీ వినాయక స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర బీసీ కార్యదర్శి, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు జి. విజయ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు సమర్పించారు. అనంతరం నిర్వహించిన భజన కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో గండేటి జంగయ్య, శంకరమ్మ, జి. విజయ్ కుమార్, శ్వేత, సాధ్విత, వినయ్ కుమార్, నీరజ, రుద్రాంశ్, రాధాకృష్ణ తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమానికి హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజా కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీ వినాయక స్వామి వారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని జి. విజయ్ కుమార్ కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలి మృతి -- సంతాపం వ్యక్తం చేసిన ఏఎంసి చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**సీతంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఉపాధ్యక్షులు నారపోగు మల్లికార్జునరావు తల్లి నారపోగు సైదమ్మ బుధవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల పానకాలరావు, శాఖ అధ్యక్షులు కొత్తపల్లి బసవయ్య, మల్లికార్జునరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైదమ్మ మృతి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నారపోగు వెంకటేశ్వర్లు, నారపోగు లచ్చయ్య, బూర వీరబాబు, జాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దేముల్ మండలంలో ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

- 9 రోజుల పూజలకు ఘనంగా ముగింపు
- మండలంలో 64 విగ్రహాలు..పెద్దేముల్‌లోనే 22 గణనాథుల నిమజ్జనం
- ఆటపాటలు, నృత్యాలతో అంగరంగ వైభవంగా శోభాయాత్ర
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు...పటిష్ఠ పోలీసు బందోబస్తు




**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 23:** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథులకు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. చిన్నారుల కోలాహలం, యువత ఉత్సాహం, మహిళల భక్తిశ్రద్ధల నడుమ గణేష్ శోభాయాత్రలు అంగరంగ వైభవంగా సాగాయి. సాయంత్రం ప్రారంభమైన శోభాయాత్రలు తెల్లవారుజామున వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. తొమ్మిది రోజుల పాటు మండపాల వద్ద ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి భక్తిపూర్వకంగా పూజలు నిర్వహించారు.

**ఆటపాటలు.. నృత్యాలతో సందడి**

నిమజ్జనోత్సవం సందర్భంగా గణేష్ విగ్రహాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ప్రత్యేక వాహనాలపై ఊరేగించారు. బ్యాండ్, బజంత్రీల నడుమ యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేయగా.. చిన్నారులు, మహిళలు సైతం శోభాయాత్రలో పాల్గొన్నారు. భక్తులు 'గణపతి బప్పా మోరియా.. మళ్లీ రావయ్యా బప్పా' అంటూ నినాదాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

**గణేష్ లడ్డూ వేలాలకు విశేష స్పందన**

తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుల లడ్డూలకు ఆయా వినాయక మండపాల వద్ద నిర్వహించిన వేలం పాటలకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. భక్తులు పోటాపోటీగా వేలం పాటల్లో పాల్గొని గణేశుడి ప్రసాదంగా భావించే లడ్డూలను దక్కించుకున్నారు.

**64 గణనాథులకు నిమజ్జనం**

పెద్దేముల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మొత్తం 64 గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇందులో మండల కేంద్రంలోనే 22 గణేష్ విగ్రహాలకు నిమజ్జనం నిర్వహించారు. పెద్దేముల్‌తో పాటు గాజీపూర్, మంబాపూర్, గోపాల్‌పూర్, మారేపల్లి, జనగాం, కందనెల్లి తండా, బుద్ధారం, నాగులపల్లి తదితర గ్రామాల్లోనూ నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో గణేష్ విగ్రహాలను విద్యుత్ దీపాలతో అలంకరించి బ్యాండ్, బజంత్రీల మధ్య శోభాయాత్రలు నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువులు, కోట్‌పల్లి ప్రాజెక్టు, పెద్దేముల్ సమీపంలోని వాగుల్లో గణనాథులను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

**పటిష్ఠ పోలీసు బందోబస్తు**

నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో భద్రతా చర్యలు చేపట్టారు. శోభాయాత్ర కొనసాగే మార్గాల్లో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. తొమ్మిది రోజుల పాటు భక్తులను అలరించిన గణేష్ ఉత్సవాలు నిమజ్జనంతో ముగిశాయి. భక్తులు గణనాథుడికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలుకుతూ వచ్చే ఏడాది మళ్లీ రావాలని ఆకాంక్షించారు.

# పొద్దుటూరు గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు శ్రీ రాంసహాయం రఘు రాంరెడ్డి సిఫారసు మేరకు చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి 218500 రూపాయల మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శ్రీనన్న యువసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ గుడిపూడి రజినీకాంత్ చేతుల మీదుగా లబ్ధిదారులైన అజ్మీర కౌశిక్ 23000 తుళ్లూరు పద్మావతి 48000. బోజడ్ల వీరయ్య 21000 షేక్ మీరా బీ 19000 తుళ్లూరు చిన్న వెంకటేశ్వర్లు 60000 దండగుల నాగ 23,500 పులి సీతారావమ్మ 24000 ల చెక్కులను ఈ రోజు ప్రొద్దుటూరు గ్రామంలో లబ్ధిదారులకు అందజేస్తున్న దృశ్యం ఈ కార్యక్రమంలో చింతకాని మండల మాజీ సిపిఐ కార్యదర్శి శ్రీ పావులూరు మల్లికార్జున రావు చింతకాని మండల సిపిఎం పార్టీ కార్యవర్గ సభ్యులు శ్రీ తూములూరి సత్యం శ్రీ పులి యజ్ఞ నారాయణ జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు శ్రీ పెంట్యాల నాగులు మీరా గ్రామ పెద్దలు శ్రీ తుళ్లూరు అచ్చయ్య శ్రీ నల్లమోతు రాంబాబు శ్రీ కాంపాటి గాంధీ తదితరులు పాల్గొన్నారు

# మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దళిత సంఘాల నేతలు



**సెప్టెంబర్ 23 (సీ కే న్యూస్) చెగుంట:** మెదక్ జిల్లా కేంద్రంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనివాసరావు ని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దళిత సంఘాల నేతలు. ఈ సందర్భంగా ఎస్పీ కి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించారు. ఆయన ఆరోగ్యంగా ఉండి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు గరుగుల శ్రీనివాస్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలసాయి హరిప్రసాద్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మాసన్నగారి నాగరాజ్, నిజాంపేట్ (ఎమ్మార్పీఎస్) మండల అధ్యక్షులు జనగామ స్వామి, (ఎన్ సి డబ్ల్యూ సి) కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు అర్క అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్లు యాదన్న, కాంగ్రెస్ నాయకులు సంగి యాదయ్య, నీలకంటి సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ కు కోర్టు సబార్డినేట్ ఉద్యోగం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం నాగులవంచ కు చెందిన కాసాని అన్నపూర్ణ (ఔ% అనగాని కళ్యాణ్ మీ సేవ) కు మధిర సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు అన్నపూర్ణ ను అభినందనలతో ముంచెత్తారు.

## ఘనంగా కర్నాటి చాణిక్య అన్నప్రాసన వేడుక...

**చిన్నారిని ఆశీర్వదించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు**



**మధిర సెప్టెంబర్ 23(సికె న్యూస్)ప్రతినిధి.** కర్నాటి ప్రత్యూష్ -సిరికావ్య దంపతుల కుమారుడు కర్నాటి చాణిక్య అన్నప్రాసన వేడుక బుధవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో అంగరంగ వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. హిందూ సంప్రదాయం ప్రకారం చిన్నారికి తొలిసారిగా అన్నం తినిపించే అన్నప్రాసన కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, చిన్నారి చాణిక్య ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వేడుకకు హాజరైన బంధుమిత్రులు చిన్నారిని ఆశీర్వదించి, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యూష--సిరి కావ్య దంపతులను చిన్నారి కర్నాటి చాణిక్యను ఆశీర్వదించారు. చిన్నారి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# పెద్దేముల్‌లో ఘనంగా గణేశ్ లడ్డూ వేలాలు



- రూ.4.35 లక్షలకు పైగా పలికిన లడ్డూ వేలం పాటలు
- భక్తిశ్రద్ధలతో పోటాపోటీగా పాల్గొన్న భక్తులు, యువత,గ్రామస్తులు

**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 23:** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పెద్దేముల్ మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణనాథుల లడ్డూలకు మంగళవారం నిర్వహించిన వేలం పాటలు భక్తి పారవశ్యంతో పాటు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ఆయా వినాయక మండపాల వద్ద నిర్వహించిన లడ్డూ వేలాల్లో భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని పోటాపోటీగా వేలం పాటలు పాడారు. గణనాథుడి లడ్డూను దక్కించుకోవడం అదృష్టంగా భావించిన పలువురు భక్తులు అధిక మొత్తాలు వెచ్చించి లడ్డూలను కైవసం చేసుకున్నారు.

**పోటాపోటీగా సాగిన వేలం పాటలు**

పెద్దేముల్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట బాల గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూకు నిర్వహించిన వేలంలో పెద్దేముల్ గ్రామానికి చెందిన నీరటి రవి రూ.20 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. గజానన్ ఉత్సవ కమిటీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో మంగలి అర్జున్ రూ.30 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. శివాజీ నగర్‌లో నిర్వహించిన వేలంలో నల్ల వెంకట్ రెడ్డి రూ.41 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకోగా, సీపీఆర్ వినాయక ఉత్సవ కమిటీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో చిట్టెపు శ్రీకాంత్ రెడ్డి రూ.51 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. కోట్ల మైసమ్మ ఆలయం వద్ద నిర్వహించిన వేలంలో దొరటి నరేష్ రూ.17 వేల రూపాయలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. పెద్దేముల్ పోస్టాఫీసు వద్ద బాలల వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో చిప్ప ప్రవీణ్ కుమార్ రూ.5,116 రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. భజరంగ్ దళ్ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో చాకలి నరేష్ రూ.51 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూకు నిర్వహించిన వేలంలో పెద్దేముల్ గ్రామానికి చెందిన కోహీర్ శ్రీనివాస్ యాదవ్ రూ.21 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. గంగయ్య మఠంలో నిర్వహించిన వేలంలో మారేపల్లి రఘు రూ.24 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. బీసీ కాలనీలో నిర్వహించిన వేలంలో కుర్వ వెంకట్ (కానిస్టేబుల్) రూ.61 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. అదే విధంగా పెద్దేముల్ ఎస్సీ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో నాగులపల్లికి చెందిన రత్నం రూ.23,500 రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి లడ్డూ వేలంలో బోడ గణేష్ రూ.25 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. విష్ణు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి లడ్డూ వేలంలో పెద్దేముల్ గ్రామానికి చెందిన అవ్వ అంజి రూ.25 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. అదేవిధంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంలో ఎర్ర లాలప్ప రూ.21 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు.

**భక్తి.. ఉత్సాహం.. సామాజిక సేవ**

పెద్దేముల్‌లోని వివిధ వినాయక మండపాల వద్ద జరిగిన లడ్డూ వేలాలు భక్తి, ఉత్సాహాల నడుమ సందడిగా సాగాయి. గణనాథుడి లడ్డూను దక్కించుకోవడం శుభప్రదంగా భావిస్తూ భక్తులు వేలం పాటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆయా ఉత్సవ కమిటీలు వినాయక ఉత్సవాల నిర్వహణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లడ్డూ వేలాల్లో విజేతలుగా నిలిచిన వారిని మండల కేంద్రంలోని ఆయా వినాయక మండపాల ఉత్సవ కమిటీల సభ్యులు, భక్తులు, గ్రామస్తులు అభినందించారు. దీంతో పెద్దేముల్ మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందడి మరింత ఉత్సాహంగా కనిపించింది. ఈ కార్యక్రమాల్లో పెద్దేముల్ గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు, చిన్నారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మధిర లో బార్ అసోసియేషన్ న్యాయవాదుల ధర్నా



**మధిర సెప్టెంబర్ 23(సికె న్యూస్)ప్రతినిధి.** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ కౌన్సిల్ (ఐలూ) పిలుపు మేరకు ఈ రోజు ది. 23-09-2026 న మధిర కోర్టు ఎదుట న్యాయవాదుల డెత్ /రిటైర్మెంట్ బెనిఫిట్స్ 25,00,000/- లక్షలకు పెంచాలని, న్యాయవాదులందరికి వైద్య సహాయం క్రింద 5,00,000/- లు జూనియర్ న్యాయవాదులకు నెలకు 10,000/- స్టైఫండ్ గా 5 సంవత్సరాల పాటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మధిర బార్ అసోసియేషన్ న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రామరాజు, ఐలూ నాయకులు సీనియర్ న్యాయవాది దిరిశాల జగన్మోహన్ రావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, చింతల గోపాల్, వాసంశెట్టి కోటేశ్వరరావు, సతీష్, కోట జ్ఞానేష్, బోజెడ్ల పుల్లారావు, విజయ్ కుమార్, పుట్టా శ్రీనివాస్, మేడా గోపీనాథ్, మాధురీ తేజ, వంశీ తేజ, పల్లపోతు కృష్ణా రావు, మందా నాగలక్ష్మి, కోట రమేష్ మరియు న్యాయవాద గుమాలు బాహాటం వేంకటేశ్వర రాజు, కొండ తదితరులు పాల్గొన్నారు.

## పితృవియోగంలో ఉన్న బీరం ను పరామర్శించిన తన్నీరు హరీష్ రావు

**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**



**సీకే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి :** కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పితృవియోగంతో విషాదంలో ఉన్న నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన హరీశ్‌రావు.. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీరం హర్షవర్ధన్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు.

“కుటుంబానికి అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండాలి” పితృవియోగం తీరని లోటని, బీరం లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు. క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొని బీరం హర్షవర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. “బీరం లక్ష్మారెడ్డి మృతి కుటుంబానికే కాదు ఆత్మీయులకు తీరని లోటు” బీరం లక్ష్మారెడ్డి మృతికి పలువురు బీఆర్ఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. పితృవియోగంలో ఉన్న కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఒకే వేదికపైకి రావడం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వివిధ మండలాల సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రిలో ఘనంగా ఉచిత ఆరోగ్య శిబిరం: 412 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు, ఆయుష్ మందుల పంపిణీ




**మహబూబాబాద్, సెప్టెంబర్.23.** 11వ అంతర్జాతీయ ఆయుష్ (ఆయుర్వేద) దినోత్సవం సందర్భంగా బుధవారం మహబూబాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఆయుష్ శాఖ సంచాలకులు మరియు ప్రాంతీయ ఉప సంచాలకుల ఆదేశాల ప్రకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఉచిత ఆరోగ్య శిబిరంలో 412 మందికి పైగా రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా ఉచితంగా ఆయుర్వేద మరియు హోమియోపతి మందులను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా, వివిధ రుగ్మతలతో బాధపడుతున్న బాధితులకు వారి వ్యాధుల తీవ్రతను బట్టి ప్రత్యేక యోగాసనాలు మరియు యోగా శిక్షణను కూడా అందజేయడం జరిగింది.

**విశేషంగా ఆకట్టుకున్న మూలికా మొక్కల ప్రదర్శన:**
శిబిరంలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఔషధ మొక్కల ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ రకాల నిత్య జీవితంలో ఉపయోగపడే మూలికలు, వాటి వైద్య విలువలు మరియు ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రజలకు వివరంగా తెలియజేశారు. ఈ ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.
ఈ సందర్భంగా ఆయుష్ వైద్య విధానాల విశిష్టతను మరియు రోజువారీ జీవితంలో యోగా యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ శిబిరంలో డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ రామకృష్ణ, డిపియం శ్రవణ్ కుమార్, సిబ్బంది కిషన్, ప్రవీణ్, సోములు, రవీందర్, వీరన్నలతో పాటు యోగా శిక్షకులు హేమ సుందర్ కమల్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో విద్యుత్ భద్రత పాటించాలి

- విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి: సర్పంచ్ లావణ్య రమేష్
- ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లొద్దు
- విద్యుత్ సమస్యలుంటే అధికారులకు సమాచారం ఇవ్వాలి



**షాద్నగర్ నియోజకవర్గం నందిగాం సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 23:** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం నందిగామ మండలం మోత్కూల గూడ గ్రామంలో రైతులు వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ సూచించారు. పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు రైతులు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తేమ కారణంగా విద్యుత్ లీకేజీ జరిగి షాక్ కొట్టే ప్రమాదం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు విద్యుత్ పరికరాల సమీపంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగిపడటం, స్తంభాలు దెబ్బతినడం, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్యలు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రైతులు స్వయంగా మరమ్మతులు చేయడానికి ప్రయత్నించకూడదన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని జెట్ట లావణ్య రమేష్ సూచించారు

## అన్నదానం వంటి పుణ్యకార్యం మరొకటి లేదు

- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి
- లంబోదర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం
- హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**షాద్నగర్ నియోజకవర్గం నందిగామ సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 23 :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం నందిగామ మండలం మొదల్లగూడ గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా లంబోదర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండపానికి విచ్చేసిన ఎమ్మెల్సీకి లంబోదర యూత్ సభ్యులుఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత,తన చేతుల మీదుగా భక్తులకు,స్థానికులకు అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండడం అభినందనీయమని అసోసియేషన్ సభ్యులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మొదలగుడ సర్పంచ్ పెంద్యాల అరుణ రాజు,మామిడిపల్లి సర్పంచ్ హన్మంత్ రెడ్డి,వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు,ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్,మాజీ ఎంపీటీసీ కాట్న రవీందర్,మాజీ సర్పంచ్లు సుధాకర్ గౌడ్,గడ్డం కవిత శ్రీనివాస్,ఉపసర్పంచ్లు విక్రమ్ రెడ్డి,గోపాల్ రెడ్డి,మామిల్లపల్లి రాజు,నాగయ్య,మాజీ ఉపసర్పంచ్ సత్య నారాయణ,బీఆర్ఎస్ నాయకులు యూత్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలాపురంలో ఘనంగా సిద్ధి వినాయకుడి నిమజ్జనం.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం తిరుమలాపురం గ్రామంలో యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సిద్ధి వినాయక స్వామివారి 25వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, సాయంత్రం భక్తుల కోలాహలం నడుమ శోభాయాత్ర నిర్వహించి అనంతరం శ్రీ సిద్ధి వినాయక స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.
వేద పండితులు లక్ష్మీకాంత్ అయ్యఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో 25వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు.

**భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర.**
సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ సిద్ధి వినాయక స్వామివారి శోభాయాత్ర ఉత్సాహభరితంగా సాగింది. డప్పు వాయిద్యాలు, భక్తిగీతాలు, జైజై నినాదాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యువత, మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా అలంకరించిన వాహనంపై వినాయకుడి విగ్రహాన్ని ఊరేగించారు.
శోభాయాత్ర గ్రామంలోని ప్రతి వీధిలోకి చేరుకున్న సమయంలో భక్తులు తమ ఇళ్ల ఎదుట స్వామివారికి దండం పెట్టుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. కొందరు భక్తులు హారతులు ఇచ్చి స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. యువత డప్పుల మోతకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేయగా, చిన్నారులు, మహిళలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో శోభాయాత్ర ఆద్యంతం భక్తి, ఉత్సాహంతో కొనసాగింది.

**ఘనంగా నిమజ్జనం.**
శోభాయాత్ర అనంతరం శ్రీ సిద్ధి వినాయక స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. భక్తులు గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ స్వామివారికి వీడ్కోలు పలికారు. అనంతరం భక్తిశ్రద్ధల మధ్య విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.
యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ఆకాంక్షించారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామ ప్రజలు, యువత, మహిళలు, భక్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక పండపాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు



**షాద్నగర్ నియోజకవర్గం నందిగామ సికె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 23:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండలం పరిధిలోని అయ్యప్ప టెంపుల్ వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారు నేడు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక పండపాలను సందర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
నందిగామ మండలంలోని అయ్యప్ప టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో, అలాగే చంద్రాయన్ గూడ గ్రామంలో నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు ప్రసాదించాలని వినాయకుడిని ప్రార్థించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు రఘు నాయక్, సుదర్శన్ గౌడ్,కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి,జంగా నర్సింహులు, బాలరాజు గౌడ్, అశోక్, చిల్కమర్రి నర్సింలు, రవి నాయక్,అన్వర్, హైదర్ ఘోరీ ,వెంకట్ రెడ్డి,లింగారెడ్డి గూడ అశోక్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ అగ్ని ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా



**సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పరిహారాన్ని అందించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారని తెలిపారు. అవసరమైతే చిన్నారులను హైదరాబాద్‌లోని కార్పొరేట్, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.
అదేవిధంగా రిమ్స్‌లో 150 పడకల సామర్థ్యంతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారని కలెక్టర్ తెలిపారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఎంసీహెచ్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు.
చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

# ఎడ్ల బండిపై బొజ్జ గణపయ్య శోభయాత్ర - సంప్రదాయానికి నమస్సులు,

**పాత జ్ఞాపకలతో ప్రజల సందడి**

**సెప్టెంబర్ 23 సీ కే న్యూస్ చేగుంట:** చేగుంట మండల కేంద్రంలోని హనుమాన్ కాలనీ నివాసులు జైశ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ విఘ్నేశ్వర గణపయ్య శోభాయాత్రను కన్నుల విందుగా సాగింది, వినాయక నిమజ్జనం అంటేనే డీజేలు, హంగామా కాదు. మన సంప్రదాయాన్ని గుర్తు చేస్తూ చేగుంట పట్టణ కేంద్రంలో విఘ్నేశ్వరుని శోభయాత్ర ఎడ్ల బండిపై అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.రంగురంగుల పూలతో అలంకరించిన ఎడ్ల బండిపై కొలువైన గణనాథుడు, మేళతాళాలతో, కోలాటాలతో, భక్తుల గణపతి నినాదాల మధ్య ఊరేగింపుగా సాగాడు. పాతకాలపు రోజులను గుర్తు చేసిన ఈ సంప్రదాయ శోభయాత్రను చూడడానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఆధునికతలో మన సంస్కృతిని మరిచిపోకుండా, ఎడ్ల బండిపై గణపయ్యను ఊరేగించడం నిజంగా అభినందనీయం అని పెద్దలు అన్నారు. ఈ కార్యక్రమంలో గణపతి బప్పా మోరియా అంటూ గణపయ్య శ్రీరామ్ యూత్ సభ్యులు, అయిత దివాకర్, వడ్ల నవీన్, కుమ్మరి శంకర్, సోమ ప్రశాంత్, సోమ అనిల్,కర్రె శీను, మాదాస్ మనీ, మాదాస్ శశికాంత్, శ్రీరామ్ యూత్ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు,

## వర్షాకాలంలో విద్యుత్ భద్రత పాటించాలి

- విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా
- ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లొద్దు
- విద్యుత్ సమస్యలుంటే అధికారులకు సమాచారం ఇవ్వాలి



**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూర్ సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 23:** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూర్ మండలం గూడూరు గ్రామంలో రైతులు వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా సూచించారు. పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు రైతులు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తేమ కారణంగా విద్యుత్ తీగ కట్టయి కనిపిస్తే షాక్ కొట్టే ప్రమాదం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు విద్యుత్ పరికరాల సమీపంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగిపడటం, స్తంభాలు దెబ్బతినడం, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్యలు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే సంబంధిత విద్యుత్ ఏఈ గారికి మరియు లైన్ ఇన్స్పెక్టర్ కి అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రైతులు స్వయంగా మరమ్మతులు చేయడానికి ప్రయత్నించకూడదన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు

## ఏవో మానసకు వీడ్కోలు.. సతీష్‌కు స్వాగతం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని: మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న వ్యవసాయాధికారుల బదిలీల సందర్భంగా చింతకాని రైతువేదికలో వీడ్కోలు, స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. గత రెండేళ్లుగా చింతకాని మండలంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఏవో మానసకు వీడ్కోలు పలికారు. ఇన్‌చార్జి ఏవో శరత్కు వీడ్కోలు పలుకుతూ, నూతన మండల ఏవోగా బాధ్యతలు స్వీకరించనున్న సతీష్కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల ఏఈవోలు, ఎరువులు, పురుగుమందులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు. రవి, ప్రభాకర్, రామలింగేశ్వరరావు, సాకేత్, నాగేశ్వరరావు, పురుషోత్తం, శ్రీనివాసరావు, నరసింహారావుతో పాటు పలువురు డీలర్లు, చింతకాని, నాగులవంచ పీఏసీఎస్ సీఈవోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న వేసంగి పంటల సాగులో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల వినియోగం తదితర అంశాలపై వ్యవసాయ అధికారులు డీలర్లు, రైతులకు పలు సూచనలు చేశారు. పంటల సాగులో రైతులు ఎదుర్కొనే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

# 8 మంది డీజే ఆపరేటర్ల పై కేసు నమోదు

- పోలీసుల హెచ్చరికలు బేఖాతర్...డీజేల ఏర్పాటు
- ఇదివరకే 14 మంది డీజే ఆపరేటర్ల బైండోవర్
- నిబంధనలు ఉల్లంఘించిన 8 మందిపై కేసులు
- ప్రజా శాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు
- పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్

**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 23:** పోలీసులు చేసిన ముందస్తు హెచ్చరికలను బేఖాతరు చేసి నిబంధనలకు విరుద్ధంగా వినాయక నిమజ్జన ఉత్సవాలలో డీజేలు ఏర్పాటు చేసిన 8 మంది ఆపరేటర్లపై పెద్దేముల్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన వినాయక శోభాయాత్రల సందర్భంగా అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేసిన ఎనిమిది మంది డీజే ఆపరేటర్లపై కేసులు నమోదు చేసినట్లు పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

### ముందుగానే హెచ్చరికలు

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన శాంతి సమావేశంలో మండల పెద్దలు,ఆయా గ్రామాల వినాయక మండపాల నిర్వాహకులకు శోభాయాత్ర సమయంలో డీజేలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టంగా సూచించినట్లు ఎస్ఐ తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

### బైండోవర్ చేసినా..

నిబంధనలు ఉల్లంఘించకుండా ఉండేందుకు మండలంలోని 14 మంది డీజే ఆపరేటర్లను పెద్దేముల్ తహసీల్దార్ బి.వెంకటేష్ ప్రసాద్ సమక్షంలో బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అయినప్పటికీ కొందరు నిబంధనలను ఉల్లంఘించి శోభాయాత్రల్లో డీజేలు ఏర్పాటు చేసినట్లు గుర్తించడంతో వారిపై కఠిన చర్యలు చేపట్టి కేసులు నమోదు చేశామన్నారు.

### ఎనిమిది మందిపై కేసులు

అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేసి అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించిన ఎనిమిది మంది డీజే ఆపరేటర్లపై బీఎన్ఎస్ సెక్షన్లు 221, 223, 292 కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడే విధంగా అధిక శబ్దం చేయడం,ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలను పోలీసులు తీవ్రంగా పరిగణించినట్లు పేర్కొన్నారు.



### నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

పండుగలు, ఉత్సవాల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా నిబంధనలు ఉల్లంఘిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ స్పష్టం చేశారు. ప్రజా శాంతి, భద్రతకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులోనూ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఇదే విధంగా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఎడ్ల బండిపై బొజ్జ గణపయ్య శోభయాత్ర - సంప్రదాయానికి నమస్సులు,

పాత జ్ఞాపకలతో ప్రజల సందడి



**సెప్టెంబర్ 23 సీ కే న్యూస్ చేగుంట:** చేగుంట మండల కేంద్రంలోని హనుమాన్ కాలనీ నివాసులు జైశ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ విఘ్నేశ్వర గణపయ్య శోభాయాత్రను కన్నుల విందుగా సాగింది, వినాయక నిమజ్జనం అంటేనే డీజేలు, హంగామా కాదు. మన సంప్రదాయాన్ని గుర్తు చేస్తూ చేగుంట పట్టణ కేంద్రంలో విఘ్నేశ్వరుని శోభయాత్ర ఎడ్ల బండిపై అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. రంగురంగుల పూలతో అలంకరించిన ఎడ్ల బండిపై కొలువైన గణనాథుడు, మేళతాళాలతో, కోలాటాలతో, భక్తుల గణపతి నినాదాల మధ్య ఊరేగింపుగా సాగాడు. పాతకాలపు రోజులను గుర్తు చేసిన ఈ సంప్రదాయ శోభయాత్రను చూడడానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆధునికతలో మన సంస్కృతిని మరిచిపోకుండా, ఎడ్ల బండిపై గణపయ్యను ఊరేగించడం నిజంగా అభినందనీయం అని పెద్దలు అన్నారు. ఈ కార్యక్రమంలో గణపతి బప్పా మోరియా అంటూ గణపయ్య శ్రీరామ్ యూత్ సభ్యులు, అయిత దివాకర్, వడ్ల నవీన్, కుమ్మరి శంకర్, సోమ ప్రశాంత్, సోమ అనిల్,కర్రె శీను, మాదాస్ మనీ, మాదాస్ శశికాంత్, శ్రీరామ్ యూత్ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు,

## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా జీవించాలి: వాకిటి.





**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు సెప్టెంబరు : 23.** వలిగొండ పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో నెలకొల్పిన గణనాథునికి మాజీ జడ్పీటీసీ వాకిటి పద్మా అనంతరెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.
విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి రైతుల కళ్లల్లో ఆనందం నిండాలని ఆమె ఆకాంక్షించారు.
అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ గౌరవాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, అధ్యక్షులు భీమిని యాదిరెడ్డి కవిత, ఉపాధ్యక్షులు కొవ్వాకుల సాయి జ్యోతి, ప్రధాన కార్యదర్శి రచ్చ సునీత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
కాలనీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు.

## అర్రూరులో వినాయక నిమజ్జనం సందర్భంగా ఘర్షణ.



**సీ కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు సెప్టెంబర్ 23.** వలిగొండ మండల పరిధిలోని అర్రూరు గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా రెండు యువజన సంఘాల సభ్యుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.

బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో స్నేహ యూత్, ఫ్రెండ్స్ యూత్ సభ్యుల మధ్య వివాదం తలెత్తింది. వివాదం క్రమంగా ఘర్షణకు దారితీసినట్లు పోలీసులు తెలిపారు.
ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన మొత్తం 18 మందిపై కేసు నమోదు చేసినట్లు వలిగొండ పోలీసులు వెల్లడించారు. వలిగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.
వినాయక నిమజ్జన శోభాయాత్రలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.
నిమజ్జనం సందర్భంగా గొడవలు, ఘర్షణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.
శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.
ప్రజలంతా సంయమనం పాటిస్తూ వినాయక నిమజ్జన కార్యక్రమాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని వలిగొండ ఎస్సై సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పటిష్ట భద్రత నడుమ అంజనాపురం యూత్ (ఇూ) యూత్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం.

**సీకే న్యూస్ ప్రతినిధి నరేందర్:** చింతకాని మండలం పందిళ్ళపల్లి ఆంజనేయ స్వామి గుడిలో నిర్వహించిన ఏపీ యూత్ గణేష్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా మేలతాళాల నడుమ భక్తులు ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ విగ్రహా ఊరేగింపుగా తరలించారు. భక్తిశ్రద్ధలతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఊరేగింపులో చిన్నలు పెద్దలు మహిళలు కోలాట నృత్యాలతో ఎంతో సంతోషంగా గణనాధుని వెళ్లి రావయ్యా, మళ్లీ రావయ్యా , మమ్మల్ని చల్లగా చూడయ్యా అంటూ గణనాధుడిని సాగనింపారు.





## మాజీ మంత్రి హరీష్ రావు గారు మరియు మాజీ మంత్రులు,మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి



బాసు హనుమంతు నాయుడు

**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రివర్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు గారు,మాజీ మంత్రులు,మాజీ ఎమ్మెల్యేలు,పార్టీ సీనియర్ నాయకులతో కలిసి, బాసు హనుమంతు నాయుడు పాల్గొన్నారు...

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ...
ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో ఉన్న అన్ని ప్రాజెక్టుల నుంచి మోటార్ ఆన్ చేసి రైతులకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.... రైతుల వ్యవసాయానికి కనీసం 12 గంటలు కరెంటు ఇవ్వలేని స్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని ఆరోపించారు....రైతుల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం, రైతుల తరఫున ప్రశ్నించే గొంతులను అణిచివేసేందుకు మా పార్టీ నాయకులను ముందస్తు నిర్బంధాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అన్నారు...
వీరి వెంట,లక్ష్మీకాంత్ రెడ్డి, బీచుపల్లి, ఆల్లపాడు ప్రతాప్,చక్రిధర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు,సోమశేఖర్ రెడ్డి, శ్రీరాములు,అంజి, ప్రహ్లాదు,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు...

## పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

- గణపతి నిమజ్జన బందోబస్తులో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసులు నమోదు
- మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై చర్యలు
- విద్యుత్ కేబుళ్లు, వైర్లను కత్తిరించి నష్టం కలిగించేలా వ్యవహరించిన కౌన్సిలర్‌పై కేసు




**సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్ :** గణపతి నవరాత్రి నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్న సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ, మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగించేలా వ్యవహరించిన ముగ్గురిపై ఆదిలాబాద్ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు తెలిపారు. భాగ్యనగర్ కు చెందిన కౌన్సిలర్ గంట జీవన్ గణపతి నిమజ్జన బందోబస్తులో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఆటంకం కలిగిస్తూ, మద్యం సేవించి అనుచితంగా ప్రవర్తించడంతో పాటు వైర్లు, కేబుళ్లు కత్తిరించి నష్టం కలిగించేలా వ్యవహరించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.
అదే విధంగా మహాలక్ష్మివాడకు చెందిన బట్టువార్ రామకృష్ణ మద్యం సేవించి గణపతి నిమజ్జన కార్యక్రమానికి ఆటంకం కలిగిస్తూ, పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించేలా మరియు ప్రజాశాంతికి భంగం కలిగించేలా ప్రవర్తించడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. క్రాంతినగర్‌కు చెందిన అరుణ్ సైతం మద్యం సేవించి గణపతి నవరాత్రి నిమజ్జన ఉత్సవాల్లో గొడవలకు దారితీసేలా ప్రవర్తించినందుకు అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గణపతి నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి ఆటంకం కలిగించడం, మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు తెలిపారు.

## రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులకు గుర్తింపు కార్డులు



**సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్ :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆదిలాబాద్ జిల్లా శాఖలో నూతనంగా జీవితకాల సభ్యత్వం పొందిన 30 మంది సభ్యులకు జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజర్షి షా మంగళవారం గుర్తింపు కార్డులను అందజేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులకు కలెక్టర్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజలకు మరింత విస్తృతంగా మానవతా సేవలు అందించాలని సూచించారు. ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడంతో పాటు రక్తదానం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ఆరోగ్య సేవలు తదితర కార్యక్రమాలను విస్తృతం చేయాలని అన్నారు. నూతనంగా జీవితకాల సభ్యత్వం పొందిన వారు సంస్థ ఆశయాలకు అనుగుణంగా చురుకుగా పనిచేస్తూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడం పట్ల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సెప్టెంబర్ 24 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై, అక్టోబర్ 4న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజ సేవ పట్ల ఆసక్తి, సేవా దృక్పథం ఉన్న ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకుని ప్రజాసేవలో భాగస్వాములు కావాలని కోరారు.
జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీని మరింత బలోపేతం చేసి, మానవతా సేవలను విస్తృతంగా నిర్వహించేందుకు సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని నిర్వాహకులు కోరారు.
కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు భీంసేన్‌రెడ్డి, కృష్ణ, ఉరే గణేష్, మసూద్, పాసుపుల రాజు, కొట్టవార్ రాజేశ్వర్, వోట్కర్ లక్ష్మీనారాయణ, జంగం సంతోష్, లింగంపల్లి నర్సింహులు, మేకల జితేందర్, లోకిరే మనోహర్, శ్రీనివాస్, నారాయణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



**సికె.న్యూస్. ప్రతినిధి అదిలాబాద్:** గత పదేళ్లుగా పట్టాల కోసం ఎదురుచూస్తున్న ఉట్నూర్ మండలం నర్సాపూర్ గ్రామస్థుల భూసమస్యను జిల్లా కలెక్టర్ రాజర్షిషా చొరవతో పరిష్కరించి బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వారికి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ను కలిసి తమ దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, తహసిల్దార్ కోట్నాక రఘునాథరావు, నర్సాపూర్ స్థానిక సర్పంచ్ గెడం జగదిరావు, పట్టాదారులు, తదితరులు పాల్గొన్నారు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక
గురువారం | తెలంగాణ
24 సెప్టెంబర్ 2026
cknews@gmail.com
CINEMA NEWS
Follow:
@cknews

# ధర్మవరం మారుతి నగర్‌లో ఘనంగా అభయ ఆంజనేయస్వామి 41వ రోజు మండల పూజ

- అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక హోమం,పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు
- మండల పూజలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు..స్వామివారి దర్శనం
- భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం.. తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు
- ప్రజలందరిపై అభయ ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలి: ఆలయ సేవకుడు శునకానంద



**ధర్మవరం,సెప్టెంబర్ 23 సి కె న్యూస్ ప్రతినిధి** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని మారుతి నగర్ 37వ వార్డులో వెలసిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో 41వ రోజు మండల పూజ కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 37 వ వార్డ్ టిడిపి ఇంచార్జ్ ఓం ప్రకాష్ హాజరై పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.గత నెల ఆగస్టు 14వ తేదీన అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించిన నేపథ్యంలో మండల పూజలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో తొలుత హోమాన్ని నిర్వహించి,ఆలయ కమిటీ సభ్యులు అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ సేవకుడు శునకానంద రాజ్ న్యూస్ ఛానల్‌తో మాట్లాడుతూ, మండల పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించామని తెలిపారు.స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన భక్తులు, ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అభయ ఆంజనేయ స్వామి కమిటీ సభ్యులు అంగజాల ఓబులపతి,కాటా రమణ,ఆకుల శీనప్ప,అమర్,కాటా మారుతి,పాగొండ శీన,రెడ్డప్ప,సురేష్, భాస్కర్,మారుతి, సుధాకర్,అధిక సంఖ్యలో మహిళలు,భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ జిల్లా కార్యదర్శిగా రాంప్రసాద్‌కు ఘన సన్మానం

**ధర్మవరం,సెప్టెంబర్ 23 సి కె న్యూస్ ప్రతినిధి** బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శిగా నూతనంగా నియమితులైన మాల్యవంతం రాంప్రసాద్‌ను ధర్మవరం పట్టణంలోని ఏపీ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో బుధవారం ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశగాళ్ల వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై రాంప్రసాద్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కేశగాళ్ల వెంకటేష్ మాట్లాడుతూ, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సూచించిన "పొలిటికల్ పవర్ ఈజ్ ది మాస్టర్ కీ" అనే సూత్రాన్ని మాన్యవర్ శ్రీ కాన్షీరామ్,కుమారి మాయావతి ఆచరణలో చూపిస్తూ బహుజన రాజ్యాధికార లక్ష్యంతో ఉద్యమిస్తున్నారని అన్నారు.ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ వర్గాల సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం బీఎస్పీ వేదికగా పనిచేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులు ప్రజాదరణ పొందుతూ అనేక పదవులను సాధించి ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

బీఎస్పీ జిల్లా కార్యదర్శి మాల్యవంతం రాంప్రసాద్ మాట్లాడుతూ,తనను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించిన ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశగాళ్ల వెంకటేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందేల గౌతమ్ మార్గదర్శకత్వంలో, జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్‌కుమార్ నేతృత్వంలో పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.ధర్మవరం నియోజకవర్గంతో పాటు శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పార్టీ సిద్ధాంతాలైన సామాజిక న్యాయం, సమత్వం, బహుజనుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తూ బీఎస్పీని మరింత బలోపేతం చేస్తానన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రజలతో కలిసి నిబద్ధతతో పోరాటం చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ ముఖ్య సలహాదారు నిడిగల్లు ధను,బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్‌కుమార్,పార్టీ నాయకులు నారాయణస్వామి, హరి,ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లికార్జున,కళ్యాణ్, ప్రదీప్, అరుణ్‌కుమార్,గణేష్ తదితరులు పాల్గొని రాంప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** :గద్వాల్ మూడో వార్డు లోని హమాలీ కాలనీ లో ఆంజనేయస్వామి ఆలయం ముందు ఓ ఇంటిపై పిడుగు పడింది డి ఈ ఓ ఆఫీసు లో పనిచేస్తున్న నరేందర్ కుమార్ రమాదేవి గార్ల ఇంటి పై పిడుగు పడింది అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు వార్డ్ కౌన్సిలర్ నాగులు యాదవ్ అలాగే వార్డు ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ సందర్శించారు

# విఘ్నేశ్వరుని దర్శించుకుని, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

బాసు హనుమంతు నాయుడు

**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** :ఈరోజు గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండలం కుర్తిరావుల్ చెరువు గ్రామంలో గజనన మహోత్సవములు సందర్భంగా ప్రతిష్టించిన గణనాథుడి మండపం వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు... అంతకముందు, గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఆశీస్సులను పొందారు....

అనంతరం,కమిటీ సభ్యులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు...

ఈ సందర్భంగా,ఆ గణనాథుని ఆశీస్సులతో మండల మరియు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, పాడిపంటలతో సుఖ సంతోషాలుగా ఉండాలని ఆకాంక్షించారు....

ఈ కార్యక్రమంలో పటేల్ జనార్ధన్ రెడ్డి, అల్లపాడు ప్రతాప్,తిరుమలేష్,వెంకటేష్ నాయుడు, శ్రీరాములు,వెంకటేష్,రాముడు,ఆంజనేయులు, లక్ష్మణ, రంగస్వామి, తిమ్మప్ప, వీరేష్, రామాంజనేయులు, నరసింహులు,మరియు నాయకులు,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు....



# - దీ=మా పోరాట ఫలితమే నేడు రైతులకు సాగునీరు విడుదల....



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** :రైతుల పక్షాన పార్టీ దీ=మా.. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు

ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని బాసు హనుమంతు నాయుడు గారి స్వగృహం నందు జూరాల కుడి కాలువ నుంచి రైతులకు నీరు విడుదల చేయడంపై బాసు హనుమంతు నాయుడు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు....

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....

నీళ్లు నిధులు నియామకాలు అనే నినాదంతో కదిలిన ఖజ= గారి వెంట నడిచి తెలంగాణ సాధనలో ముందుండి, తెలంగాణ వచ్చాక కూడా నీటి కష్టాలను చూసి రైతులను పోగేసి జంగ్ నడిపిన పార్టీ దీ=మా పార్టీ అని పేర్కొన్నారు.... గద్వాల నియోజకవర్గంలోని కృష్ణా నది పరివాక ప్రాంతాల రైతులు బాధలను చూసి వేలాది మంది రైతులతో పోరాటానికి సిద్ధమైన నన్ను పోలీసులు గృహనిర్బంధం చేసినా,రైతుల బాధను చూసి,పార్టీ శ్రేణులు మరియు మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల గారు రైతులు కలిసి దాదాపు 6 గంటల పాటు రహదారిపై బైఠాయించి ధర్నా చేసినా పోరాట ఫలితమే నేడు రైతులకు సాగునీరు విడుదల చేశారు అన్నారు..బీఆర్ఎస్ దెబ్బకు దిగొచ్చి,కాంగ్రెస్ సర్కార్ ఎట్టకేలకు జూరాల నుంచి నీటి విడుదల చేసిందని అన్నారు..జూరాల ప్రాజెక్టు నుంచి నీరు అందక.. పొలాలు ఎండిపోతున్న వేళ, రైతులతో కలిసి బీఆర్ఎస్ చేసిన పోరాటం ఫలించింది అని పేర్కొన్నారు..కుంభకర్ణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముల్లుగర్రతో తట్టి మేల్కొలిపిన బీఆర్ఎస్ పోరాటం అని అన్నారు...

జూరాల కుడి కాలువలకు నీటి విడుదలపై,ఇది రైతుల విజయమని ఆయన హర్షం వ్యక్తం చేశారు...

రైతుల హక్కుల కోసం ప్రశ్నించేది...తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేది..బీఆర్ఎస్ పార్టీ మాత్రమే.. అని స్పష్టం చేశారు....బి

ఈ కార్యక్రమంలో బీచుపల్లి, లక్ష్మీకాంత్ రెడ్డి,అల్లపాడు ప్రతాప్, చక్రిధర్ రెడ్డి,వెంకటేష్ నాయుడు, మోనేష్ మరోజు,శ్రీరాములు,డ్యామ్ శ్రీను,మాలిక్,వెంకటేష్ యాదవ్,గంగాధర్,అరవిందు,రవి, వీరేష్, భాస్కర్, మహేందర్,మరియు నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....

## 37,8 వ వార్డు లలో వినాయకునికి పూజలు చేసి దర్శించుకున్న శ్రీ బి.యస్.కేశవ్ మున్సిపల్ కౌన్సిలర్లు

**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** :ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని 37వ వార్డులో లంబోధర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపంలో బి.యస్.కేశవ్ కౌన్సిలర్ గంగాళం మంజులరాణి గార్లు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు తదనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు

తరువాత 8 వ వార్డు లో కూడా కొటేష్ గారి అద్వర్యం లో బీసీ కాలనిలో ఏర్పాటు చేసిన విగ్నేశ్వరుడిని దర్శించుకున్నారు తదనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గద్వాల పట్టణ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆ విఘ్నేశుని కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని భగవంతుడిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ పులిపాటి వెంకటేష్ గోపాల్ మోహన్ నర్సింహా బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోటేష్ చిత్తారి కిరణ్ కమ్మరిరాము పెయింటర్ రాము వడ్డేకృష్ణ మరియు భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# వై.ఎస్ జగన్ ను కలిసిన పయిల ద్వయం




**తాడేపల్లి, సి కె న్యూస్ ప్రతినిధి** :వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు, పయిల శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్ఈసి మెంబెర్ పయిల సన్యాసి రాజు బుధవారం విజయవాడ తాడేపల్లి లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లా ల రీజినల్ కో ఆర్డినటర్ కూరసాల కన్నబాబు, మాజీ మంత్రి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినటర్ గుడివాడ అమర్నాథ్, పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ సమక్షంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రేటర్ విశాఖపట్నం పరిధి లోని స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో శ్రీ వై.ఎస్. జగన్ నిర్వహించిన సమావేశానికి సంబంధించిన కార్యక్రమంలో భాగంగా పయిల శ్రీనివాసరావు వై.ఎస్ జగన్ ను కలిశారు., అలాగే ఇటీవల నూతనంగా రాష్ట్ర ఎస్ఈసి మెంబెర్ గా నియమితులైన పి.ఎస్ రాజు ని వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ పరిస్థితులు, స్థానిక రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అంశాలతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం వంటి అంశాల పై చర్చించినట్లు తెలిపారు. మాడుగుల నియోజకవర్గ పరిశీలకులుగా పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని పయిల శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సూచనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామని పేర్కొన్నారు.